క్లుప్తంగా

ముగిసిన పదో తరగతి పరీక్షలు



పెనుగంచిప్రోలు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పెనుగంచిప్రోలులో ఉన్న రెండు పరీక్షా కేంద్రాల్లో మండలంలోని మొత్తం 478 మంది విద్యార్థులు ఈఏడాది పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమైన పరీక్షలు శనివారంతో ముగియటంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఒకరినొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చి తీసుకెళ్లారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం గ్రామానికే చెందిన కట్టా రమేష్ సౌజన్యంతో విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు మాట్లాడుతూ అన్ని దానిల్లో విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. ఈకార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఈమని బ్రహ్మారెడ్డి, గ్రామ నాయకులు గుత్తా నారాయణరావు, హెచ్ఎం షేక్ ఖాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణోత్సవం



నందిగామ: పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండపై కల్యాణం వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శనివారం స్వామి వారికి సుప్రభాత సేవతో పాటు ప్రత్యేకంగా తీసుకువచ్చిన నదీ జలాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. ఆ తర్వాత పలు రకాల సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. స్వామి వారి, అమ్మవార్ల మూల విరాట్‌లకు చందనాలంకరణ సేవ, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చేందుకు ప్రభుత్వం కృషి




కంచికచర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చేలా తగు చర్యలు చేపట్టిందని ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ అన్నారు. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన హెర్మోన్ మినిస్ట్రీస్ 14వ విజయోత్సవాల సువార్త ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రైస్తవులకు కమ్యూనిటీ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు బ్రదర్ విజయకుమార్, మాథ్యూస్, నెహెమ్యా, డేవిడ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదుగుల శంకర్, మార్త శ్రీనివాసరావు, కాలవ పెద బాబు విశ్వాసులు, పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో దాడి

జగ్గయ్యపేట : ఓ వ్యక్తిపై బీరు బాటిల్‌తో దాడి చేసిన ఘటన పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు, పోలీసుల కథనం ప్రకారం..జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన పి.రంగా, ఎం.రవి చంద్, కే.రాజేష్‌లు స్నేహితులు. వీరంతా మద్యం సేవించేందుకు పట్టణ సమీపంలోని ఓ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకున్నారు. పట్టణంలోని డాంగే నగర్‌కు చెందిన వినయ్ అనే స్నేహితుడిని కూడా మద్యం తాగేందుకు పిలిచారు. రూములో మద్యం సేవిస్తున్న సమయంలో గోపి, వినయ్‌లకు మధ్య ఘర్షణ జరిగింది. దీంతో గోపి చేతిలో ఉన్న బీరు బాటిల్‌ను పగలగొట్టి వినయ్ మెడపై పొడిచాడని పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలైన వినయ్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు మెరుగైన చికిత్సకోసం విజయవాడ తరలించారు. బాధితుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ బి.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా విద్యుత్ స్తంభాల పనులు

- రూ.20 లక్షలతో నూతనంగా 100 విద్యుత్ స్తంభాలు
- రామన్నపేట, చందర్లపాడు రహదారులు 80 అడుగుల మేర విస్తరణ
- త్వరలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు



నందిగామలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

నందిగామటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్‌ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నందిగామ నుంచి రామన్నపేట, చందర్లపాడు రోడ్లను 80 అడుగులు విస్తరించే క్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 20 అడుగుల మేర మట్టిని తీసి విస్తరిస్తున్నారు. గతంలో రోడ్డు వెంబడి ఉన్న ఎత్తు తక్కువ విద్యుత్‌స్తంభాలను తొలగించి రోడ్డు చివరకు కొత్త స్తంభాలను ఏర్పాటుచేసే ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో చిన్న స్తంభాలు ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో పెద్ద ఎత్తు రౌండ్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. నెల రోజులుగా విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తుండటంతో రోడ్డు పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. కొత్తగా సుమారు 100 స్తంభాలు వేస్తున్నారు. గతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న 10 ట్రాన్స్‌ఫార్మర్‌లను కూడా తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా కొత్తవి నిర్మిస్తున్నారు.

పూర్తి కావస్తున్న పనులు

విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది శ్రమించి విద్యుత్ లైన్‌ల పనులు చేస్తుండటంతో విస్తరణ పనులు పూర్తి కావచ్చాయి. వారం రోజుల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అందుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు ఏర్పాటు చేసే పనులు పూర్తి కానున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దిబ్బయ్య తెలిపారు. ఎత్తైన స్తంభాలను ఏర్పాటు చేయటంతో పట్టణంలో కొత్త శోభ ఏర్పడుతోంది. గతంలో పట్టణంలో నుంచి భారీ వాహనాలు, వరిగడ్డి లోడు, సుబాబుల్ లోడు వాహనాలు వెళ్లాలంటే విద్యుత్ తీగలు తగిలి ఇబ్బందులు పడుతుండేవారు. రానున్న కాలంలో ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు భారీ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు పూర్తి కాగానే పట్టణంలో డివైడర్‌లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారు. రెండు ఆర్అండ్‌బీ రహదారులు అయినప్పటికీ మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా వారి వద్ద నుంచి అనుమతులు తీసుకుని దాతల సహకారంతో రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రధానంగా ఇన్వెంటా కెమికల్స్, క్రషర్స్ నిర్వాహకులు రోడ్ల నిర్మాణానికి కావాల్సిన రా మెటీరియల్స్ ఇవ్వటంతో ప్రభుత్వం నుంచి ఖర్చు లేకుండానే రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: అట్టడుగు వర్గాల వారికి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు చేకూర్చటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మోహనరావు మాట్లాడుతూ అంబేడ్కర్ విశ్వమానవ మూర్తి అని, వివక్షలేని సమాజమే ఆయన ఆశయమన్నారు. అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజాన్ని స్థాపించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ చావల రవిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, నాయకులు కందుల బుచ్చి రామయ్య, యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, జంపాని నాగేశ్వరరావు, వేగినీడి సుబ్బారావు, శ్రీనివాసరావు, కస్తాల పున్నమ్మ, చావల రామలింగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సంఘం శరణం గచ్ఛామి'

నటులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్



అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

కంచికచర్ల : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి పట్టణంలో హైద్రాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి 'సంఘం శరణం గచ్ఛామి' అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకాన్ని తిలకించేందుకు పలు గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను సామాన్యులకు అర్థమయ్యేలా చూపించారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచన శైలిని నేటి యువత తెలుసుకుని, ఉన్నతమైన విలువలు ఆశయాలతో జీవించాలని నాటకంలో చాలా చక్కగా ప్రదర్శించారన్నారు. అనంతరం అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సభ్యులను ఎమ్మెల్సీ పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. సర్పంచి వేల్పుల సునీత, ఉపసర్పంచి వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు మాదుగుల మధుబాబు ఏఎంసీ వైస్ చైర్మన్ మాదుగుల శంకర్, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, మార్త శ్రీనివాసరావు, కాలవ పెద బాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



నూతన చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పెద్దలు

బలుసుపాడు(జగ్గయ్యపేట): క్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని అధ్యక్ష బంధం పీఠాధిపతి రెవ.డాక్టర్ జార్జ్ కోర్నిలియాస్ తంతేపూడి పేర్కొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ పాల్ దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువు ఏసుక్రీస్తు మార్గం ప్రేమమార్గమని ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ముందుగా గ్రామంలో ప్రతిష్ఠ సిలువ మార్గం నిర్వహించారు. చర్చి నిర్మాణానికి స్థలదాతలు మైలా జాన్‌పీటర్, చిరంజీవమ్మల కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి శోభారాణి, కృష్ణా, గోదావరి జిల్లాల స్త్రీల మైత్రి అధ్యక్షురాలు జాషువా కుమారి, జగ్గయ్యపేట సౌత్‌డీనరీ చైర్మన్ చిలువూరి జయరాజు, డయాసీస్ ప్రతినిధులు రవికుమార్, సుధాకర్, ఆలె గ్జాండర్, చర్చి కౌన్సిల్ చైర్మన్ చంద్రకుమార్, పాకాలపాటి కనకరాజు, జోసఫ్, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రచార భేరి ర్యాలీలో కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

జగ్గయ్యపేట: కేంద్ర ప్రభుత్వం ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో మోడీకో హఠావో.. దేశ్ కో బచావో ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పాలనలో దేశ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా దేశంలో కార్పొరేట్ పాలన సాగుతుందని ప్రభుత్వం రంగ సంస్థలను సైతం కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేలా మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. మోడీ పాలనలో ఆర్థిక నేరగాళ్లు అధికమవుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోనెపూడి శంకర్, శ్రీనివాసరావు, ఆంబోజి శివాజి, మారిశెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

తిరువూరు: రంజాన్ మాసం సందర్భంగా తిరువూరులో ముస్లింలకు ఒక మహిళ నిత్యావసర సరుకులు, చీరెలు పంపిణీ చేశారు. స్థానిక లైన్ బజారులో నివసించే అబీదాఖాన్ అనే మహిళ శనివారం 150 మందికి రంజాన్ తోఫా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



పల్లెంపల్లి కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, గృహ సారథులు

వీరులపాడు: మండలంలో 'జగనన్నే మా భవిష్యత్తు' మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలను పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కొణతాలపల్లి, తాటిగుమ్మి, పల్లెంపల్లి, గోకరాజుపల్లితో పాటు అన్ని గ్రామాల్లో శనివారం రాత్రి నిర్వహించారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్య ఉన్న తేడాను వివరించారు. అనంతరం సంక్షేమ పథకాలను వివరించి గృహ యజమాని అనుమతితో ఇంటికి, ఫోన్‌కు స్టిక్కర్‌లు అంటించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, సర్పంచ్‌లు పలకా మోహన్‌రెడ్డి, నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ, పలువురు నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు.

కంచికచర్ల: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక గొట్టుముక్కల రోడ్డు, వసంతకాలనీ, పెట్రోలు బంక్ సెంటర్, హనుమాన్‌పేటతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ నగర్, అరుంధతీనగర్‌లతో పాటు పలు కాలనీలలో మండల గృహసారథుల కన్వీనర్ చింతా రవీంద్ర నాథ్, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని పెండ్యాలలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, కీసరలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి పేరం నర్సమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. మండలంలోని పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, మాగంటి వినయభూషణరావు, మార్త శ్రీనివాసరావు, మోగులూరులో సొసైటీ అధ్యక్షుడు బండి జానకిరామయ్య, వైఎస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎస్ అమరవరంలో సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, సర్పంచి కోదాటి సీతారాం, గండేపల్లిలో సర్పంచి బొక్కా రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మిలు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, మాదుగుల మధుబాబు, పాపట్ల సీత పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: 'జగనన్నే మా భవిష్యత్తు', మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొని ఇంటి యజమాని అనుమతితో ఇంటి తలుపులపై, సెల్‌ఫోన్‌పై స్టిక్కర్లను అంటిస్తున్నారు. అనిగండ్లపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

33 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

మైలవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మైలవరం నియోజకవర్గంలోని 33 మందికి రూ.23.34లక్షలు మంజూరైంది. సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఎనిమిది మందికి రూ. 4.66లక్షలు, జీ.కొండూరు మండలంలోని 10 మందికి రూ.9.15 లక్షలు, మైలవరం మండలంలోని 7గురికి రూ.4.46 లక్షలు, రెడ్డిగూడెం మండలంలోని ఆరుగురికి రూ.3.02 లక్షలు, విజయవాడ రూరల్ మండలంలో ఇద్దరికి రూ.2.05 లక్షలు మంజూరయ్యాయి.

చీరల పంపిణీ

తిరువూరు: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రంగప్రకాష్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా తిరువూరులో క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. స్థానిక బోస్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ పట్టణ అధ్యక్షుడు దోసపాటి రవికుమార్, రీజియన్, జోనల్ చైర్మన్లు పవన్‌కుమార్, ఎస్. రామారావు, జిల్లా క్లబ్ ప్రతినిధులు రాజేశ్వరరావు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పర్వతాపురంలో క్రీస్తు రక్షణ సంఘం వారి ఆధ్వర్యంలో మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. మేరీస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జె.ఐజక్(విజయవాడ) సుమారు 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిద్దె శివాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మిద్దె సత్యనారాయణ, చర్చి పాస్టర్ వంగల యోనోష్ పాల్గొన్నారు.

శీతలపానీయాలు తాగొద్దు

తిరువూరు: వేసవిలో దాహార్తి తీర్చుకునేందుకు శీతల పానీయాలను ఆశ్రయించవద్దని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ సూచించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం శీతల పానీయాలతో కలిగే అనర్థాలు వివరిస్తూ జేవీవీ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రసాయనాలు, విషపూరిత పదార్థాలుండే శీతల పానీయాలతో అనారోగ్యంబారిన పడే అవకాశం ఉన్నందున ప్రకృతి సిద్ధ పానీయాలను సేవించాలని గంగాధర్ కోరారు. కొబ్బరిబోండాలు, పండ్ల రసాలు తీసుకుంటే వేసవి దాహార్తి నుంచి ఉపశమనం పొందవచ్చని, ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు. కరపత్ర ఆవిష్కరణలో జేవీవీ ప్రతినిధులు పాపారావు, ప్రభాకరరావు, నాగేంద్ర ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు నన్నపనేని, వేమా తదితరులు

కంచికచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలోని ప్రజలందరూ సురక్షితంగా ఉంటారని ఆ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరిన కంచికచర్లకు చెందిన 30 కుటుంబాలు, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజా రమణి ఆధ్వర్యంలో శనివారం రాత్రి తిరిగి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలోకి చేరి మూడు రోజులయినప్పటికీ తాము ఆపార్టీలో ఇమడలేకపోతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ జీవితాలకు వెలుగు నిస్తున్నాయని అందుకే తిరిగి సొంత గూటికి చేరుతున్నామన్నామని మహిళలు అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ తమ కుటుంబాలకు అనేక మేలులు చేశారన్నారు. వాటిని మర్చిపోయి టీడీపీలోకి చేరినా తమ మనస్సు అంగీకరించకపోవటంతో తిరిగి సొంత పార్టీలోకి వచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

తల్లిపై కుమారుడి దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి వాటా ఇవ్వాలని తల్లిపై దాడి చేసిన కుమారుడిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వడ్డెర కళ్యాణ మండపం ప్రాంతంలో బొంత లక్ష్మమ్మ నివాసం ఉంటుంది. లక్ష్మమ్మకు ఇద్దరు సంతానం. భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటుంది. కుమారుడు అశోక్ తాపీ పని చేస్తుంటాడు. గతంలో అశోక్ తల్లిని ఇంటిలో నుంచి వెళ్లిపోవాలని వేధించడమే కాకుండా కొట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ లో కుమార్తె వద్ద ఉంటూ తిరిగి వచ్చిన లక్ష్మమ్మను అశోక్ తనకు ఇంటిలో వాటా ఇవ్వాలని దాడి చేసి కొట్టాడు. దీంతో లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేదలకు మేలు చేసేందుకే నవరత్నాలు

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



నేషనల్ ఫెలోషిప్ అవార్డులు ప్రదానం చేసిన ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కొన్ని పత్రికలు ప్రజల మనసులను కలుషితం చేయడానికి కంకణం కట్టుకుని పనిచేస్తున్నాయని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం విజయవాడ ఐలాపురం కన్వెన్షన్‌లో ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లోవిశిష్ట సేవలందించిన వారికి నేషనల్ ఫెలోషిప్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, వాటిలోని లోపాలను విమర్శిస్తే తప్పులేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని అడ్డంగా విమర్శించడం దురదృష్టకరమన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి తానెప్పుడు చూడలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై కక్షతో ఈ రాష్ట్ర ప్రజలపైన కక్ష తీర్చుకుంటున్నారేమోనని తాను భావిస్తున్నానన్నారు. తెలుగు మీడియమే గొప్పదని ప్రచారం చేస్తున్న ప్రముఖుల పిల్లలు ఏ ఒక్కరైనా తెలుగు మీడియంలో చదువుతున్నారా? ప్రభుత్వ బడులలో చదువుతున్నారా ?అని నిలదీశారు. కొన్ని పత్రికలుతామే ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రభుత్వంపై దండోర ప్రకటించి తమ వ్యాపార, రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నాయని ధ్వజమెత్తారు. బలహీనవర్గాలకు ఇంత అండగా నిలిచిన ప్రభుత్వాన్ని గతంలో తానెప్పుడూ చూడలేదన్నారు. విభిన్న రంగాల్లో కృషి చేసిన పలువురు ప్రముఖులకు గౌతమ బుద్ధ, జ్యోతిరావు పూలే, సావిత్రి భాయిపూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ పేర్లతో నేషనల్ ఫెలోషిప్ అవార్డులను అందజేశారు. ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, ఫిలంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకులు అద్దంకి రాజ, మేదర సురేష్, కొల్లి రమాదేవి, డాక్టర్ గూటం స్వామి, జల్లి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ రాజకీయవేత్త 'కంచి'



తిరువూరు: రాజకీయాల్లో నిస్వార్థంగా వ్యవహరించిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు నేటి తరం రాజకీయవేత్తలకు ఆదర్శప్రాయుడని తిరువూరు ఎమెల్యే కే రక్షణనిధి అన్నారు. శనివారం తిరువూరు శ్రీరస్తు కల్యాణమంటపంలో కంచి రామారావు సంస్మరణ సభ జరిగింది. ఆయనకు పలువురు రాజకీయనాయకులు నివాళులర్పించారు. తిరువూరు ప్రాంత అభివృద్ధికి పాటుపడిన కంచి రామారావు ఎల్లకాలం ఈ ప్రాంత ప్రజలకు గుర్తుంటారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నానీ), తిరువూరు నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు ఈ సంతాపసభలో మాట్లాడారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఆటోనగర్(విజయవాడ తూర్పు): వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆటోనగర్ అగ్నిమాపక అధికారి నరేష్ తెలిపారు. అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆటోనగర్‌లోని బస్‌టెర్మినల్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బస్సుల్లో వెళ్లే ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. నరేష్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఎండలు అధికంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయాలన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుందని... పాడైపోయిన స్విచ్ బోర్డులను మార్చుకోవాలని సూచించారు. ఆర్టీసీ డీఎం ప్రవీణ్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.